క్లుప్తంగా

మావటూరులో పంటకోత ప్రయోగం



పంట కోత ప్రయోగాన్ని చేపట్టిన అధికారులు

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరులో బుధవారం అధికారులు పంట కోత ప్రయోగాలును చేపట్టారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా గ్రామానికి చెందిన రైతు నారాయణప్ప పొలంలో కంది పంటకోత ప్రయోగం చేశారు. అనంతరం గ్రామంలోని చెరువులు, చెక్ డ్యాములను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాండురంగడు, శ్రీనివాస్ నాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనం చేసుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

పెనుకొండ: పట్టణంలోని ప్రముఖ జైన దేవాలయంలో పచ్చే పార్శ్వనాథస్వామి ఆలయాన్ని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అరుణ్ బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం తర్వాత న్యాయమూర్తి బెంగళూరు వెళ్లారు. అంతకు ముందు స్థానిక న్యాయమూర్తులు శంకరరావు, ముజీబ్ ఆయనకు స్వాగతం పలికారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీ కేంద్రంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తోందన్నారు. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, గ్రామ కార్యదర్శి ఆనంద్, బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పావగడలో కలెక్టర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పావగడ: తుమకూరు జిల్లా నూతన కలెక్టర్ శుభా కళ్యాణ్ బుధవారం పావగడ లో పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు ఆమెకు రాజవంతి సరిహద్దు వద్ద ఘన స్వాగతం పలికారు. దేవలకెరె క్రాస్ నలిగానహళ్లిలో పర్యటించి పశు సంవర్ధన శాఖ ఆధ్వర్యంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సంభాషించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు.

ఉరుసు జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: పెనుకొండ బాబయ్య స్వామి ఉరుసు మహోత్సవాన్ని కుల, మతాలకు అతీతంగా విజయవంతం చేయాలని ముస్లీం మైనార్టీలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పాలడైరీ వద్ద వారు ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఉరుసు ఉత్సవాలు పెనుకొండ దర్గా పీఠాధిపతి తాజ్ బాబా ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం అవుతాయన్నారు. ముస్లీం నగరా అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, సున్నీ జమాత్ నాయకులు మహబూబ్ దౌలా, షబ్బీర్, అబ్దుల్ రహిమాన్, అక్రమ్, దాదు, ఫయాజ్, తుంగోడు బాషా పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ మీనాక్షి

గుడిబండ: మండల పరిధిలోని మోరబాగల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.చరణ్‌కుమార్ జిల్లా స్థాయి' కౌశల్ -2023 సైన్స్‌పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ చూపిన చరణ్‌కు రూ.3000 నగదు బహుమతిని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి అందజేశారు. మీనాక్షి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థి చరణ్, అలాగే సైన్స్ టీచర్ ఉపేంద్రను మీనాక్షి అభినందించారు. ఈ కార్యక్రమానికి ఎచ్ఎమ్ నాగప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: మండలంలోని సి. చెర్లోపల్లి పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో కొత్త చెరువులో జరుగుతున్న కౌశల్ టాలెంట్ టెస్ట్‌లో రాణించారు. ఎం.దీక్ష, నిఖిల్, రమష్ జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థులకు రూ.4500 ప్రభుత్వం అందజేశారు. అదే పాఠశాలకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు హర్షిత, సాహితి కూడా పోస్టర్స్ మేకింగ్‌లో 3వ స్థానంలో నిలిచారు. వారికి ప్రభుత్వం రూ.1000 అందజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

అయ్యప్ప దీక్ష .. ఆరోగ్యానికి రక్ష

- మాలధారులతో కిటకిటలాడుతున్న అయ్యప్పస్వామి ఆలయాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు
- వందలాది మందికి ఉచిత అన్నదానం



హిందూపురంలో పూజకు హాజరైన అయ్యప్ప మాలధారులు



పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్

హిందూపురం అర్బన్: స్వామియే.. శరణమయ్యప్పా అన్న నామస్మరణ మార్మోగుతోంది. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఎంతోమంది అయ్యప్పమాలను ధరించారు. ఆయా ప్రాంతాల్లోని అయ్యప్ప ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలను ఆచరిస్తున్నారు.

కఠిన నియమాలు

అయ్యప్పస్వామి మాలధరించిన వారు కఠిన నియమాలు ఆచరించాల్సి ఉంటుందని గురుస్వాములు చెబుతున్నారు. మాలవేసినప్పటి నుంచి దీక్ష పూర్తయ్యే వరకూ ఏకభుక్తం (ఒక్కపూట భోజనం చేయాలి) చేయాలి. ఇంట్లో అన్ని రోజులు నియమాల ప్రకారం భోజనం చేయడం కుదరదు. అందుకే చాలా వరకు బృందంగా ఏర్పడి స్వయంగా, కుదరని వారు ప్రత్యేకంగా మడిగా(నియమ నిష్టలతో) రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం (బిక్ష) తయారు చేయించుకొని స్వీకరిస్తారు. వివిధ ఆలయాల్లో అయ్యప్పస్వామి కమిటీల ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఉచితంగానే అన్నప్రసాదాన్ని అందజేస్తున్నారు.

క్రమ శిక్షణకు బాటలు

41 రోజుల పాటు కఠిన బ్రహ్మ చర్యం. నియమ నిష్టలతో ఆచరించే అయ్యప్పస్వామి దీక్ష శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ప్రశాంతత చేకూరుస్తుందని గురుస్వాములు చెబుతున్నారు. మనిషిలో సత్ప్రవర్తన నెలకొల్పి క్రమశిక్షణకు బాటలు వేస్తుందంటున్నారు.

చన్నీటి స్నానంతో ఉత్తేజం

ఉదయం, సాయంత్రం వేళల్లో చన్నీటితో స్నానం చేయడంతో శరీరంలో శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం పెరుగుతాయని చెబుతున్నారు. చక్కటి శిరస్నానంతో రక్తపోటు తగ్గి జీర్ణశక్తి పెరుగుతుందని అంటున్నారు. హిందూపురం పట్టణంలోని వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారులకు 41 రోజుల పాటు అన్నప్రసాదాలను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి బిక్షకు అవసరమయ్యే నిధులు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. లేపాక్షి, చిలమత్తూరులలో కూడా దాతలు ముందుకు వచ్చి బిక్ష ఏర్పాటు చేసి స్వాముల ఆశీర్వాదం తీసుకుంటున్నారు.

భక్తితో పాటు ఆరోగ్యం



అయ్యప్పస్వామి దీక్ష చేపట్టడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. దారి తప్పుతున్న జీవితాన్ని తీర్చిదిద్దేందుకు అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుంది. చెడు అలవాట్లను మాలధారణ కచ్చితంగా దూరం చేస్తుంది. ఆధ్యాత్మిక చింతన, దృడ సంకల్పం స్వామిపై విశ్వాసంతో దీక్ష చేపడితే అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కావచ్చు. నేను ఇప్పటి వరకు 34 సార్లు మాల వేసి అయ్యప్ప స్వామిని దర్శించుకొన్నా. ఈ ఏడాది స్వాముల సంఖ్య మరింతగా పెరిగింది.

– మనిస్వామి, చిలమత్తూరు

ఇదే స్ఫూర్తితో పని చేయండి



సబ్‌కలెక్టర్ కార్తీక్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెనుకొండ: సబ్‌కలెక్టర్‌గా 14 నెలల పాటు సేవలందించాను. తనకు అధికారులు, ఉద్యోగులు అందించిన సహకారం మరచిపోలేను. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో అందరూ పనిచేయాలి' అని సబ్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సబ్‌కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ బదిలీ అన్నది ఉద్యోగికి సర్వసాధారణమన్నారు. బాగా పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా ఉంచండి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం: రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీషీటర్ల కదలికలపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం హిందూపురంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు, ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎన్ని కేసులు నమోదయ్యాయి. వాటి పురోగతిపై ఆరా తీశారు. మద్యం, ఇసుక అక్రమ రవాణా, గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళ పోలీసులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కంజాక్షన్, సీఐలు రియాజ్ అహమ్మద్, శ్రీనివాసులు, వేణుగోపాల్, ఎస్ఐలు, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి



మానేపల్లిలో సభాస్థలిని పరిశీలిస్తున్న నాయకులు

లేపాక్షి: వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మంత్రి పెద్దిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి చంద్రహాసన్ తెలిపారు. బుధవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో హిందూపురం నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో మంత్రి పర్యటన ఉంటుందన్నారు. అందరూ కలిసికట్టుగా మంత్రి పర్యటన విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో సభా వేదిక ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన చేశారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, నాయకులు మధుమతిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నీలావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు సచివాలయ పరిధిలోని నింకంపల్లిలో 22వ వార్డు కౌన్సిలర్ ముస్తక్ పటేల్, టౌన్ ఏ బ్లాక్ కన్వీనర్ సీఎం సాదిక్, జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సచివాలయ పరిధిలో జెండాను ఎగురవేసి, లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇంద్రజ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు ఆసీఫ్, మణి, ఇర్షాద్, షాజియా, రహమత్‌బీ, రోషన్ అలీ, మల్లికార్జున, అయూబ్, నాగేంద్రబాబు, జేసీఎస్ కన్వీనర్ నౌషాద్, నాయకులు షఫీ, దాదు, చంద్ర, మహేష్ గౌడ్, కిరోసిన్ బాబు, హబీబ్, వార్డు ఇన్‌చార్జ్‌లు డిష్ చాంద్, నాయకులు సుభాష్ గాంధీ, రియాజ్, ఆటోనగర్ యూనియన్ ప్రెసిడెంట్ అంజాద్ బాషా, లక్ష్మీ నారాయణ, నూరుపాల్గొన్నారు.

విద్యార్థుల పాలిట దైవం సీఎం జగన్

- ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్



విద్యార్థులకు బ్యాగులకు పంపిణీ చేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్

చిలమత్తూరు: పేద విద్యార్థుల పాలిట దైవం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ అన్నారు. బుధవారం ఆయన బైరేకుంట వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. చిలమత్తూరు, లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సీఎం జగన్‌కు మరొక్క అవకాశం అని ముద్రించిన బ్యాగులను సాయిప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ తానే పెద్ద కొడుకుగా నిలిచి అమ్మఒడి , విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీఎంబర్స్‌మెంట్, జగనన్న గోరుముద్ద వంటి సంక్షేమ పథకాలను అందించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారని కొనియాడారు. అన్నీ తామై బతుకుతున్న తల్లిదండ్రులను విస్మరించకుండా మంచి స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ మద్దిపి లక్ష్మినారాయణ, నరసింహారెడ్డి, సుందరరాజు, రామచంద్రారెడ్డి, కోడూరు బాబు, జనార్దన్‌రెడ్డి , లేపాక్షి నాయకులు వేణురెడ్డి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఆ శాఖ ఏపీఓ గోపాల్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏఏ గ్రామాల్లో ఎంతమంది కూలీలు పని చేస్తున్నారు? బిల్లులు ఎంత మందికి వచ్చాయి? ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సాయినగర్‌లో బుధవారం తెల్లవారుజామున రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయి. సాయినగర్‌కు చెందిన తిరుమలేష్, సంజీవరాయుడు తమ ఇళ్ల ముందు మంగళవారం రాత్రి నిలిపి ఉంచారు. ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అయితే ఒకరు మాత్రమే ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యుత్‌శాఖ డీఈ సుబ్రహ్మణ్యప్రసాద్ అందించారు.

అక్షింతల ఊరేగింపు

అమరాపురం: అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముని అక్షింతలను అమరాపురంలో బుధవారం ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు అక్షింతలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం దేవగానపల్లికి ఆ గ్రామస్తులు తీసుకెళ్లారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

అగళి: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను పారదర్శంగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ సుబ్బరావు, ఆర్ఐ గుర్రన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

మడకశిరలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

మడకశిర: పట్టణంలో బుధవారం ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ , ఎస్ఎఫ్ఐ నాయకులు నాగార్జున, బాబ్‌జాన్, ఈరేష్, పవన్, దాము, హరి, వంశి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాంజనేయస్వామికి చంద్రహారం వితరణ



వెండి చంద్రహారం అందజేస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలో వెలసిన పెద్దాంజనేయ స్వామికి రొద్దం సీతారామశాస్త్రి ద్వితీయ కుమారుడు సంధ్యా శ్రీహరి బుధవారం వెండితో ప్రత్యేకంగా తయారు చేసిన చంద్రహారాన్ని ఆయల అర్చకుడు గిరీష్‌స్వామికి అందించారు. మొక్కుబడిగానే అంజన్నకు చంద్రహారం అందజేసినట్లు తెలిపారు.

జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో కోరారు. ప్రతి గ్రామంలోవైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు జన్మదిన వేడుకలను నిర్వహించాలని కోరారు.

పెనుకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం మడకశిర రోడ్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ స్వగృహంలో కేక్ కటింగ్ ఉంటుందన్నారు.

పదో తరగతి మోడల్ పేపర్ల పంపిణీ

రొద్దం: మండల పరిధిలోని కోగిర, తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను బుధవారం ఎంఈఓ-1 విజయభాస్కర్ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. దాతలు శివయ్య, అశోక్, చంద్ర సహకారంతో మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు రూపొందించిన మోడల్ పేపర్లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని పరీక్షా ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు శివరాం, నారాయణరెడ్డి, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పరిగి: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణించాలని పైడేటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక పాఠశాలలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ రామాంజినేయులు ఆర్థికసాయంతో 25 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ చదువుతో పాటూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీ రామాంజినేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నివారించండి

పావగడ: తాలూకా వ్యాప్తంగా భ్రూణ హత్యలు పెరిగిపోతున్నాయని, భ్రూణ హత్యలతో ఆడపిల్లల సంతతి క్షీణిస్తోందని తాలూకా కర్ణాటక రక్షణ వేదిక మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ ఆందోళన వ్యక్తం చేశారు. భ్రూణ హత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తాలూకా కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు.

బీజీ హళ్లిలో స్పెయిన్ బృందం పర్యటన

రొళ్ల: మండల పరిధిలోని బొమ్మగొండనహళ్లిలో బుధవారం స్పెయిన్ బృందం సభ్యులు పర్యటించారు. ముందుగా గ్రామాల్లో ఆర్డీటీ ద్వారా నిర్మాణం చేపట్టిన కమ్యూనిటీ భవనం, ఇళ్లు, మరుగుదొడ్ల వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీటీ రూ.50 వేలతో లక్ష్మమ్మ అనే మహిళకు నిర్మించి ఇచ్చిన చిల్లర దుకాణాన్ని వారు పరిశీలించారు. ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, ఏటీఎల్ ఓబులేసు , స్పెయిన్ బృందం సభ్యులు అనా, ఈరాటీ, అరంఛా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో గురువారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చికెన్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు



చికెన్ వ్యర్థాలు ఉన్న ప్రదేశాన్ని శుభ్రపరచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ రూరల్: 'హైవే పై చికెన్ వ్యర్థాలు' అన్న శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారి పక్క వేసిన చికెన్ వ్యర్థాలను తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు కూడా జారీ చేశారు. నిర్దేశించిన ప్రదేశంలోనే వ్యర్థాలను వేసేలా ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



భీమినేని జనార్ధన్, అధ్యక్షుడు



నరెడ్డుల రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు

పెనుకొండ: పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల సంయుక్త కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు సరసం జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. అధ్యక్షుడిగా భీమినేని జనార్దన్, ఉపాధ్యక్షుడిగా మాణిక్యం ఇసాక్, ప్రధాన కార్యదర్శిగా నరెడ్డుల రాజారెడ్డి, సహ కార్యదర్శిగా ముంటిమడుగు బాబాజాన్, కోశాధికారిగా ఖగేంద్ర, కార్యవర్గ సభ్యులుగా రుద్రప్ప, ప్రతాప్‌రెడ్డి, నాగరాజమ్మ, మహమ్మద్ ఆలీ, తేజ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. భాస్కర్‌నాయుడు, డాక్టర్ శివణ్ణ పర్యవేక్షణలో కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు.



వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న గోవింద మాలధారులు

నమో వేంకటేశా..

హిందూపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద వెలసిన శ్రీనివాస మందిరంలో బుధవారం గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.